# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంపుటి : 3 | సంచిక : 272 | శనివారం 7 ఫిబ్రవరి 2026 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com





## ఛాలెంజ్ ఓటు

- ఓట్లు పలు రకాలు
- ఎన్నికల్లో రంగురంగుల కవర్లు
- ఎన్నికల్లో పలు రకాల ఓట్లు
- ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, నాట్ టు ఓటు విధానాలు
- ఓటరు ప్రతి సమస్యకు నిర్దేశించిన ప్రకారం పరిష్కారాలు

హైదరాబాద్

ఎన్నికల్లో పలు రకాల ఓట్లు ఉంటాయని ఇప్పటికీ చాలా మందికి తెలియదు. వీటిలో ముఖ్యమైనవి ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, నాట్ టు ఓటు వంటి విధానాలను ఎన్నికల సంఘం ప్రవేశ పెట్టింది. ఓటరును పోలింగ్ ఏజెంట్ ఛాలెంజ్ చేసిన సమయంలో రూ.5 నగదును వారి వద్ద నుంచి తీసుకొని ఓటరు గుర్తింపును పోలింగ్ అధికారి పరిశీలించి నిర్ధారణ చేస్తారు. అధికారులు సంతృప్తి చెందితే, ఆ ఓటరును వెంటనే ఓటు వేయడానికి అనుమతిస్తారు. ఒక ఓటరు ఓటును అంతకు ముందే వేరే ఎవరైనా వేసినట్లు సదరు ఓటరు నిర్ధారిస్తే పోలింగ్ అధికారులు తమకు ఇచ్చిన బ్యాలెట్ పేపర్లలో చివరి బ్యాలెట్ పేపరును సదరు ఓటరుకు - మిగతా3లో

## మళ్లీ అధికారంలోకి
# కాంగ్రెస్

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయబోతున్నాం
- 'కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేస్తారనే కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి అప్పగించాం'
- 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారింది
- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా నిజామాబాద్‌కు ఏం చేయలేదు
- నిజామాబాద్ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- కేసీఆర్, కేటీఆర్‌లను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారు



హైదరాబాద్

లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బీజేపీ చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేటీఆర్, కేసీఆర్‌ను అరెస్టు చేస్తారని కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే ఇంతవరకు అతి లేదు గతి లేదని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్‌లను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. అసలు కిషన్‌రెడ్డి ఎందుకు కాపాడుతున్నారు? అని ప్రశ్నించిన సీఎం కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని ధ్వజమెత్తారు. ఎప్పుడో కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి, మీరు కట్టిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి? అని ప్రతిపక్షంపై ప్రశ్నలు సంధించారు. నిజామాబాద్ జిల్లా బర్దిపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. ఫిబ్రవరి 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా తెలంగాణకు గొప్ప నాయకులను అందించిందని, మున్సిపల్ ఎన్నకల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలని జిల్లా ప్రజానికాన్ని కోరారు. 10 ఏళ్ల - మిగతా3లో




## మీకు ఏది సరైనదనిపిస్తే
## అదే చేయండి

- మోదీ ప్రసంగంపై రాహుల్ సెటైర్
- ప్రధాని ప్రసంగంపై రాహుల్ వ్యంగ్య విమర్శ
- మకర్ ద్వార్ వద్ద ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నినాదాలు
- కీలక ప్రశ్నలకు మోదీ సమాధానం ఇవ్వలేదని జైరాం రమేశ్ ఆరోపణ



## మా ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము ప్రధానికి లేదు

- ప్రధాని చేసిన ప్రసంగంలో పనికొచ్చే అంశం ఒక్కటి కూడా లేదు
- మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో పార్లమెంట్‌ను నడపడం లేదు
- నరేంద్రమోదీ అబద్ధాలు మళ్లీమళ్లీ చెప్పడమే తన పనిగా పెట్టుకున్నారు
- ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే



## ప్రజలే మిమ్మల్ని వద్దనుకున్నారు

- ప్రశాంత్ కిశోర్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- బిహార్ ఎన్నికల సమయంలో ఎన్‌డీఏ కూటమి మహిళలకు రూ.10 వేలు పంపిణీ చేసింది
- అసెంబ్లీ ఎన్నికల్లో నియామావళిని ఎన్‌డీఏ కూటమి ఉల్లంఘించిందని సుప్రీంకోర్టులో ప్రశాంత్ కిషోర్ పిటిషన్
- 'ప్రజలే మీ పార్టీని వద్దనుకున్నారు' అని చురకలంటించింది

# స్పీకర్‌పై సుప్రీం ఆగ్రహం



- ఎమ్మెల్యేల కేసు.. స్పీకర్‌పై సుప్రీంకోర్టు సీరియస్
- మూడు వారాల్లో నిర్ణయం తీసుకోకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని
- తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సుప్రీంకోర్టు చివరిగా మరో అవకాశం
- అనర్హత అంశాన్ని తేల్చాలని ఇప్పటికే స్పీకర్‌కు చాలా సమయం ఇచ్చామని వ్యాఖ్యానించిన ధర్మాసనం..
- అనర్హత పిటిషన్లపై విచారణ పూర్తిచేసి కోర్టుకు నివేదిక సమర్పించాలని స్పీకర్‌ను ఆదేశం

ఢిల్లీ

తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత కేసు విషయంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మూడు వారాల్లో నిర్ణయం తీసుకోకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని హెచ్చరించింది. తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సుప్రీంకోర్టు చివరిగా మరో అవకాశం ఇచ్చింది. బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై నేడు సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ - మిగతా3లో



## విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురు

- రూ.1.50 కోట్ల పెనాల్టీ చెల్లించాల్సిందే!
- టీవీకే చీఫ్ పిటిషన్ కొట్టివేత
- ఆదాయపు పన్ను శాఖ ఆర్డర్ సమంజసమేనన్న న్యాయస్థానం
- 2015 నాటి సోదాల్లో బయటపడ్డ లెక్కలు
- రూ.15 కోట్ల ఆదాయాన్ని దాచారని అభియోగం

## దేవుడిపై ఒట్టేసి రైతులను మోసం చేసిన
# పాపాత్ముడు రేవంత్‌రెడ్డి

- కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే జిన్నారంను మున్సిపాలిటీ చేసి మీ మీద పన్నుల భారం మోపింది
- మున్సిపాలిటీ అయితే ప్రజల మీద పన్నుల భారం పడుతుందని ఆపాం
- కేసీఆర్ రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.2000 చేస్తానని హామీ ఇచ్చారు
- అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఆ హామీని నెరవేర్చారు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్‌రావు



జిన్నారం

మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్‌రావు పటాన్‌చెరువు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీలో శుక్రవారం పర్యటించారు. జిన్నారం గ్రామం వాకిటి వద్ద స్థానికులతో ముచ్చటించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న తీరును ఎండగట్టారు. తాము అధికారంలో ఉన్నప్పుడు జిన్నారం గ్రామం గ్రామపంచాయతీగానే ఉండాలని కోరుకున్నామని, మున్సిపాలిటీ అయితే ప్రజల మీద పన్నుల భారం - మిగతా3లో

# మీకు ఏది సరైనదనిపిస్తే అదే చేయండి




రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంపై కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. జో ఉచిత్ సమ్జో వహీ కరో (మీరు సరైనది అనుకున్నది చేయండి) అంటూ వ్యంగ్యంగా విమర్శించారు. పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం ఉదయం చేపట్టిన నిరసనలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు.

శుక్రవారం ఉదయం పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన కొనసాగించారు. భారత్, అమెరికా డీల్‌ను ట్రాప్ డీల్‌గా వర్ణిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ సమయంలో వారితోపాటు రాహుల్ గాంధీ కూడా పాల్గొని నినాదాలు చేశారు. అప్పుడే మీడియాతో మాట్లాడుతూ, జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ విమర్శించారు.

అదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మోదీ ప్రసంగం తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని, ప్రతిపక్షం లేవనెత్తిన కీలక అంశాలకు ప్రధాని సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ప్రధాని ప్రసంగ సమయంలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ వాకౌట్ చేసిన విషయం తెలిసిందే. జాతీయ భద్రత, చైనా అంశాలపై తమ ఆందోళనలకు సరైన సమాధానం రాలేదనే కారణంతో సభను బహిష్కరించామని ఖర్గే తెలిపారు. "ప్రధాని ప్రసంగానికి స్పందించాల్సిన అవసరం లేదు. కానీ ఆయన చెప్పిన అసత్యాలకు సమాధానం ఇవ్వాల్సి వస్తోంది. అబద్ధాలను పదేపదే చెప్పడం ఆయన అలవాటైపోయింది" అని ఖర్గే విమర్శించారు. 97 నిమిషాల ప్రసంగంలో ప్రధాని గత 100 ఏళ్లు, 75 ఏళ్లు, 50 ఏళ్ల చరిత్ర గురించి మాత్రమే మాట్లాడారని, కానీ ప్రస్తుత సమస్యలపై స్పష్టత ఇవ్వలేదన్నారు. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం. నరవాణే రాసిన స్మృతిగ్రంథం (మెమోయర్) అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వం సభను తప్పుదోవ పట్టించిందని ఖర్గే ఆరోపించారు.

### ప్రభుత్వం ఎందుకు ఇబ్బందిపడింది?

"ఆ పుస్తకం ఇప్పటికే ప్రచురితమై మా చేతుల్లో ఉంది. అయితే అది ప్రచురించలేదని రక్షణ మంత్రి పార్లమెంట్‌లో ఎలా చెబుతారు? ఇది మీ కళ్ల ముందే ఉన్న విషయం" అంటూ ప్రశ్నించారు. హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా అదే విషయాన్ని పునరావృతం చేశారని, చివరికి రాహుల్ గాంధీ సభలో పుస్తకాన్ని చూపించిన తర్వాత నిజం బయటపడిందన్నారు. అలాగే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చైనా అంశాన్ని లేవనెత్తినప్పుడు ప్రభుత్వం ఎందుకు ఇబ్బందిపడిందని ఖర్గే ప్రశ్నించారు.

"నిజం వినండి, సమాధానం ఇవ్వండి. లేదంటే ఖండించండి" అని వ్యాఖ్యానించారు. ప్రధాని ప్రసంగంలో విషయపరమైన సమాధానాలు లేకపోవడంతోనే ప్రతిపక్షం వాకౌట్ చేసినట్లు చెప్పారు. "మేం లేవనెత్తిన సమస్యలకు ఆయన దగ్గర సమాధానం లేదు. తర్వాత మాపై విమర్శలు చేయడమే చేశారు" అని విమర్శించారు. సిక్కు సమాజాన్ని అవమానించామన్న ఆరోపణలను కూడా ఖర్గే ఖండించారు. "సిక్కు సమాజాన్ని మేం గౌరవిస్తాం. డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి రెండుసార్లు ప్రధానిగా సేవలందించారు" అని గుర్తుచేశారు. గత 10 ఏళ్లుగా కాంగ్రెస్‌పై విమర్శలు చేయడమే తప్ప ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టలేదని ఖర్గే ఆరోపించారు.

### ప్రధాని ప్రసంగం అంతా అసత్యాలతోనే!

అదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కూడా ప్రధాని ప్రసంగంపై తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యసభలో ప్రతిపక్షం లేవనెత్తిన కీలక అంశాలకు ప్రధాని సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు. "ప్రధాని ప్రసంగం అసత్యాలతో, అసహనంతో నిండి ఉంది. 97 నిమిషాల ప్రసంగం నిరాశాజనకం" అంటూ ఎక్స్ వేదికగా స్పందించారు. అంతర్జాతీయ అంశాలపై కూడా కేంద్ర ప్రభుత్వం మౌనం పాటిస్తోందని రమశ్ ఆరోపించారు. భారత్– పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం చేశానని చేసిన వ్యాఖ్యలపై ప్రధాని స్పందించలేదని ప్రశ్నించారు. అలాగే చైనా అంశంలో కూడా స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు.

# విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురు



ప్రముఖ సినీ నటుడు, 'తమిళగ వెట్రి కజగం' పార్టీ అధినేత దళపతి విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆదాయపు పన్ను శాఖ తనకు విధించిన రూ.1.50 కోట్ల భారీ జరిమానాను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. ఐటీ శాఖ జారీ చేసిన పెనాల్టీ ఉత్తర్వులు చట్టబద్ధంగానే ఉన్నాయని, నిర్ణీత గడువులోపే ఆ నోటీసులు జారీ అయ్యాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. దీంతో విజయ్ ఇప్పుడు ఆ జరిమానా చెల్లించడం లేదా పై కోర్టులకు వెళ్లడం అనివార్యమైంది. ఈ కేసు మూలాలు 2015 నాటివి. 2015 సెప్టెంబర్‌లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు విజయ్ నివాసంలో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో విజయ్ నటించిన 'పులి' సినిమాకు సంబంధించి కొన్ని కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సినిమా ద్వారా విజయ్ సుమారు రూ.15 కోట్ల అదనపు ఆదాయాన్ని పొందారని, కానీ ఆ మొత్తాన్ని తన ఆదాయపు పన్ను రిటర్నుల్లో చూపించలేదని ఐటీ శాఖ ఆరోపించింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ ఆదాయాన్ని దాచిపెట్టారన్నది ప్రధాన అభియోగం.

### రూ.1.50 కోట్ల పెనాల్టీ

సోదాల్లో లభించిన ఆధారాల మేరకు ఐటీ శాఖ చర్యలకు ఉపక్రమించింది. లెక్కల్లో చూపని ఆ రూ.15 కోట్ల ఆదాయానికి సంబంధించి, 2022 జూన్ 30న ఒక ఉత్తర్వు జారీ చేసింది. దీని ప్రకారం విజయ్ రూ.1.50 కోట్ల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ విజయ్ 2022లోనే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి బెంచ్, 2022 ఆగస్టు 16న పెనాల్టీ చెల్లింపుపై మధ్యంతర స్టే విధించింది.

### వాదనలు ఏంటి?

విజయ్, ఐటీ శాఖ తరఫున హోరాహోరీ వాదనలు జరిగాయి. "ఐటీ శాఖ జారీ చేసిన పెనాల్టీ ఆర్డర్ కాలం చెల్లింది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 275 ప్రకారం, 2019 జూన్ 30 లోపే ఈ ఉత్తర్వులు ఇవ్వాలి. కానీ మూడేళ్లు ఆలస్యంగా ఇచ్చారు కాబట్టి దీన్ని రద్దు చేయాలి" అని విజయ్ తరఫున వాదనలు వినిపించారు. చట్టంలోని సెక్షన్ 263 ప్రకారం, షోకాజ్ నోటీసు జారీ చేయడం, పెనాల్టీ విధించడం అన్నీ నిబంధనల ప్రకారమే, నిర్ణీత గడువులోపే జరిగాయి. ఇందులో ఎలాంటి ఉల్లంఘన లేదు" అని ఐటీ శాఖ వాదనలు వినిపించింది.

### న్యాయమూర్తి తీర్పు ఇదే

ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ సెంథిల్‌కుమార్ రామమూర్తి గత నెలలో (జనవరి 23న) తీర్పును రిజర్వ్ చేశారు. తాజాగా శుక్రవారం తుది తీర్పు వెలువరించారు. "ఐటీ శాఖ జారీ చేసిన పెనాల్టీ ఆర్డర్ గడువులోపే ఉంది. ప్రక్రియలో ఎలాంటి లోపాలు కనిపించడం లేదు. కాబట్టి ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం" అని న్యాయమూర్తి ప్రకటించారు.

### విజయ్‌కు ఉన్న ఆప్షన్ ఏంటి?

పిటిషన్‌ను కొట్టివేసినప్పటికీ, కోర్టు విజయ్‌కు ఒక వెసులుబాటు కల్పించింది. ఐటీ శాఖ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆదాయపు పన్ను అప్పీలేట్ ట్రిబ్యునల్ లేదా సంబంధిత అప్పీలేట్ అథారిటీని ఆశ్రయించడానికి విజయ్‌కు స్వేచ్ఛ ఉందని తెలిపింది. పరిమితి చట్టం కాకుండా ఇతర అంశాలపై అక్కడ పోరాడవచ్చని సూచించింది. రికార్డుల ప్రకారం, విజయ్ 2016-17 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.35.42 కోట్ల ఆదాయాన్ని డిక్లేర్ చేశారు. అయితే సోదాల్లో బయటపడ్డ ఆ రూ.15 కోట్ల అదనపు ఆదాయం లెక్కల్లో లేకపోవడమే ఇప్పుడు ఈ జరిమానాకు దారితీసింది.

# 'ప్రజలే మిమ్మల్ని వద్దనుకున్నారు'



జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఛాలెంజ్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. బిహార్ ఎన్నికల సమయంలో ఎన్‌డీఏ కూటమి మహిళలకు రూ.10 వేలు పంపిణీ చేసిందని, అది నియామావళిని ఉల్లంఘించడమే అంటూ ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని విచారించింది. ఈ సందర్భంగా అత్యున్నత ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. 'ప్రజలే మీ పార్టీని వద్దనుకున్నారు' అని చురకలంటించింది. ఇప్పుడు ఈ న్యాయ వేదికను ప్రచారానికి వాడుకుంటున్నారా అంటూ ప్రశ్నించింది.

"అసెంబ్లీ ఎన్నికల్లో మీకు ఎన్ని ఓట్లు వచ్చాయి? ఇప్పటికే ప్రజలు మిమ్మల్ని తిరస్కరించారు. ఇప్పుడు ప్రజాదరణ పొందడానికి న్యాయ వేదికను ఉపయోగించుకుంటున్నారా? ఇంతవరకు వేచిచూడకుండా అప్పుడే ఎవరైనా ఆ పథకం గురించి మా దృష్టికి తీసుకువచ్చి ఉండాల్సింది. ఇప్పుడు వచ్చి ఎన్నికలను రద్దు చేయాలంటూ ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు. ఈ సమస్య కేవలం రాష్ట్రానికి సంబంధించినది కాబట్టి, మీరు హైకోర్టును సంప్రదించండి." అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. మరోవైపు, ఎన్నికల ముందు ఉచితాల గురించి దాఖలైన పిటిషన్‌ను పరిశీలిస్తున్నామని, మార్చిలో వాటిని విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది.

### ఎన్నికల్లో ఘోర ఓటమి పాలైన జన్‌సురాజ్ పార్టీ !

గతేడాది నవంబర్‌లో బిహార్‌లో 243 స్థానాలకు గానూ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అందులో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి 202 స్థానాలను గెలుచుకుని అధికారాన్ని నిలబెట్టుకుంది. అయితే, ఆ ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ పార్టీ 238 స్థానాల్లో పోటీకి దిగి ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. అంతేకాదు, ఆ పార్టీ అభ్యర్థుల్లో చాలా మంది తమ డిపాజిట్లనూ కోల్పోయారు. ఈ నేపథ్యంలో జన్ సురాజ్ పార్టీ (జేఎస్‌పీ) ఎన్‌డీఏ కూటమి గెలుపును సవాల్ చేస్తూ బిహార్‌లో కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

అయితే, జన్‌సురాజ్ పార్టీ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది సీ.యు. సింగ్ తన వాదనలు వినిపించారు. ఎన్‌డీఏ కూటమి, ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ప్రకటించిన పథకాన్ని 'ఎంసీసీ' అమల్లో ఉండగానే అందుకు సంబంధించిన నిధులు విడుదల చేసిందని ఆయన ఆరోపించారు. అది ఓటర్లను ప్రభావితం చేయడానికి ఉద్దేశపూర్వక ప్రయత్నమని పిటిషన్‌లో పేర్కొన్నారు.

### అసలు ఈ పథకం లక్ష్యమేంటి?

బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్‌డీఏ కూటమి వ్యూహాత్మకమైన అడుగులు వేసింది. రాష్ట్ర మహిళల అభ్యున్నతి కోసం 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున 75 లక్షలమంది మహిళల బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేశారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో బిహార్ ఎన్‌డీయే ప్రభుత్వం రూ.7,500 కోట్లతో ఈ పథకాన్ని రూపొందించింది. ప్రతి కుటుంబంలోని ఓ మహిళకు జీవనోపాధిలో భాగంగా వారు ఎంచుకున్న రంగంలో ఆర్థికసహాయం అందిస్తామని తెలిపింది. వ్యవసాయం, పశుపోషణ, హస్తకళలు, టైలరింగు, నేత, చిన్నతరహా సంస్థల వంటి ఎంపిక చేసిన రంగాల్లో మహిళలకు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పింది. ఇదిలా ఉండగా, బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమిలోని బీజేపీ పార్టీ 89 స్థానాలను దక్కించుకోగా, జేడీయూ 85, ఎల్‌జేపీ (ఆర్‌వీ) 19 స్థానాలను, హెచ్‌ఏఎం 5, ఆర్‌ఎల్‌ఎం 4 స్థానాలను దక్కించుకున్నాయి. ఉపముఖ్యమంత్రులు విజయ్ కుమార్ సిన్హా, సామ్రాట్ చౌధరీతో పాటు జానపద గాయనీ మైథిలీ ఠాకూర్, ప్రేమ్ కుమార్, శ్రేయసి సింగ్, బిజేంద్ర ప్రసాద్ యాదవ్ తదితర కీలక నేతలు విజయం సాధించారు. మరోవైపు, ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ మాత్రం కేవలం 35 సీట్లకే పరిమితమై ఘోర ఓటమిని చవిచూసింది.

## మా ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము ప్రధానికి లేదు

ప్రధాని నరేంద్రమోదీపై కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు, రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. గురువారం రాజ్యసభలో ప్రధాని చేసిన ప్రసంగంలో పనికొచ్చే అంశం ఒక్కటి కూడా లేదని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో పార్లమెంట్‌ను నడపడం లేదని విమర్శించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఖర్గే.. నరేంద్రమోదీ అబద్ధాలు మళ్లీమళ్లీ చెప్పడమే తన పనిగా పెట్టుకున్నారని ఖర్గే ఎద్దేవా చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో జరిగిన చర్చకు ప్రధాని గురువారం సమాధానమిచ్చారు. అయితే ప్రధాని 97 నిమిషాల సమాధానంలో ఒక్కటైన్నా ముఖ్యమైన విషయంగానీ, తప్పనిసరి విషయంగానీ లేదని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై తాము చేసిన ప్రతిపాదనల్లో ఒక్కదానికి కూడా ప్రధాని స్పందించలేదని ఖర్గే చెప్పారు. ఆయన కేవలం 100 ఏళ్లు, 75 ఏళ్లు, 50 ఏళ్లు అని ఏదేదో మాట్లాడారని ఎద్దేవా చేశారు. తమ నాయకుడు రాహుల్‌గాంధీ ఆర్మీ మాజీ చీఫ్ నరవణె పుస్తకం విషయాన్ని ప్రస్తావించంగానే అధికార పక్షం మొత్తానికి నొప్పి కలిగిందని ఖర్గే వ్యాఖ్యానించారు.

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టులు, ఒక కమాండో మృతి

మహారాష్ట్ర లోని గడ్చిరోలిలో మరో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. నిన్న (గురువారం) ఉదయం నుంచి భద్రతాబలగాలు, మావోయిస్టుల (మీుశీఱర్ం) మధ్య జరుగుతున్న ఎదురుకాల్పుల్లో ఒక కమాండో కూడా ప్రాణాలు కోల్పోయారు. మరో పోలీస్ అధికారి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భమ్రాగడ్ తాలూకాలో గురువారం నుంచి ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. ఇందులో ఇద్దరు మహిళలతో సహా ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి ఒక ఏకే-47 రైఫిల్‌తోపాటు పలు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో సీ-60 కమాండో దీపక్ చిన్న మాధవి (38) తీవ్రంగా గాయపడటంతో అతడిని హెలికాప్టర్‌లో భమ్రాగడ్‌లోని ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో అధికారి కూడా గాయపడగా.. అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా ప్రాంతంలో మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## మీకు చేతకకాపోతే చెప్పండి స్పీకర్ కు సుప్రీం ఫైనల్ వార్నింగ్

**న్యూఢిల్లీ :** ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు చివరి అవకాశమిచ్చింది. ఈ అంశంపై మూడు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టమైన గడువు విధించింది. నిర్ణీత గడువులోగా నిర్ణయం ప్రకటించకపోతే కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించింది.పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల ధర్మాసనం ఇవాళ విచారణ జరిపింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో ఇప్పటికే స్పీకర్‌కు చాలా సమయం ఇచ్చామని గత విచారణలో వ్యాఖ్యానించిన కోర్టు, ఈసారి మరింత కఠినంగా వ్యవహరించింది.విచారణ సందర్భంగా ప్రభుత్వం తరపున న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇప్పటికే విచారణ జరుపుతున్నారని కోర్టుకు తెలిపారు. ఒక ఎమ్మెల్యే పిటిషన్‌పై విచారణ పూర్తయిందని, మరో ఇద్దరిపై ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం తీసుకోవడానికి మరింత సమయం కావాలని ఆయన కోరారు.ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, తుది అవకాశంగా మూడు వారాల గడువు మంజూరు చేసింది. ఈ గడువు తర్వాత తదుపరి విచారణ జరుపుతామని పేర్కొంటూ, కేసును మూడు వారాలకు వాయిదా వేసింది.

## 10 తర్వాత ట్రేడ్ డీల్‌పై ఉమ్మడి ప్రకటన

**న్యూఢిల్లీ :** భారత్, అమెరికా మధ్య ఒక ప్రధాన వాణిజ్య ఒప్పందం ప్రకటించిన తర్వాత, రెండు దేశాలు ఇప్పుడు ఒప్పందం పూర్తి వివరాలు వెల్లడికి సిద్ధమవుతున్నాయి. దీనిపై ఒక ఉమ్మడి ప్రకటన రెడీ చేస్తున్నాయి. ఈ ఉమ్మడి ప్రకటన రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల్లో లేదా అంతకంటే ముందుగానే వస్తుంది. రెండు రోజుల తరువాత, అమెరికా ఒక కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేస్తుందని భావిస్తున్నారు, ఇది భారతీయ వస్తువులపై సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తుంది.ఈ సమాచారాన్ని కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్, వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ అందించారు. ఈ వారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన అదే హై-ప్రొఫైల్ వాణిజ్య ఒప్పందం ఇదేనని వివరించారు. ఈ ఒప్పందంపై దాదాపు ఒక సంవత్సరం నుంచి చర్చలు కొనసాగుతున్నాయి. మార్చి మధ్య నాటికి ఈ ఒప్పందం అధికారికంగా సంతకాలు జరగొచ్చని పియూష్ గోయల్ కూడా పేర్కొన్నారు.న్యూఢిల్లీలో గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జిసిసి) అధికారులతో సంయుక్త విలేకరుల సమావేశం తర్వాత విలేకరులతో మాట్లాడుతూ పియూష్ గోయల్ మాట్లాడుతూ, "ఇద్దరు నాయకులు అంగీకరించినట్లుగా భారత్, యునైటెడ్ స్టేట్స్ మధ్య మంచి చర్చలు జరుగుతున్నాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) మొదటి దశ దాదాపు సిద్ధంగా ఉంది. రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల్లో లేదా ముందుగానే, భారత్, యునైటెడ్ స్టేట్స్ మధ్య ఉమ్మడి ప్రకటన జారీ అవుతుందని, దాని ఆధారంగా, ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆశిస్తున్నాము."ఈ ఉమ్మడి ప్రకటన తర్వాత, భారత్‌పై విధించిన 25 శాతం సుంకం, 25 శాతం జరిమానా సుంకాన్ని అమెరికా మొత్తం 50 శాతంగా 18 శాతానికి తగ్గించవచ్చని పియూష్ వివరించారు. ఇది తరువాత అధికారిక ముసాయిదా ఒప్పందానికి దారి తీస్తుంది, దీనిపై మార్చి మధ్యలో న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య సంతకం చేస్తారని భావిస్తున్నారు.

కొత్త టారిఫ్ ఒక కార్యనిర్వాహక ఉత్తర్వు ద్వారా అమలు

అమెరికా కార్యనిర్వాహక ఉత్తర్వు తర్వాత కొత్త 18 శాతం సుంకం అమల్లోకి వస్తుందని పియూష్ గోయల్ అన్నారు. ఉమ్మడి ప్రకటన జారీ అయిన రెండు రోజుల తర్వాత ఈ కార్యనిర్వాహక ఉత్తర్వు రావచ్చని ఆయన అన్నారు. "ఉమ్మడి ప్రకటన నాలుగు నుంచి ఐదు రోజుల్లో లేదా అంతకంటే ముందే రావచ్చు. మేము ఈ మొత్తం ప్రక్రియను చాలా వేగంగా పూర్తి చేయాలని చూస్తున్నాం" అని మంత్రి అన్నారు.

ఈ నిర్ణయం భారత్ ఎగుమతులకు తక్షణ ప్రయోజనం చేకూరుస్తుంది, దీని విలువ ౩30 బిలియన్లకు పైగా ఉంటుందని అంచనా. వీటిలో వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, సముద్ర ఉత్పత్తులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు ఉన్నాయి. ఈ విషయం తెలిసిన వ్యక్తులు సుంకం తగ్గింపు ఈ రంగాల్లో అమెరికాకు అమ్మకాలను పెంచుతుందని చెప్పారు.

రాజేష్ అగర్వాల్ తదుపరి ప్రక్రియను వివరించారు.

వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ కూడా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఉమ్మడి ప్రకటన అనేది ఒక సాధారణ ప్రక్రియ అని అన్నారు. "నాయకత్వ స్థాయిలో ఒప్పందం ఖరారైన తర్వాత, ఉమ్మడి ప్రకటన జారీ అవుతుంది. మంత్రి పియూష్ గోయల్ చెప్పినట్లుగా, అది రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల్లో లేదా అంతకంటే ముందుగానే రావచ్చు" అని ఆయన అన్నారు.

ఉమ్మడి ప్రకటన తర్వాత, దీనిని చట్టపరమైన ఒప్పందంగా మారుస్తామని, ఆ ఒప్పందం అమల్లోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. దీనికి మార్చి మధ్యకాలం గడువు అని అగర్వాల్ పేర్కొన్నారు. భారత్‌లో సుంకాలు ఓఈఔ వ్యవస్థ కింద నియంత్రిస్తున్నందున, చట్టపరమైన ఒప్పందంపై సంతకం చేసిన తర్వాతే భారత్ సుంకాల తగ్గింపు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. యునైటెడ్ స్టేట్స్‌లో, కార్యనిర్వాహక ఆదేశాల ద్వారా సుంకాలు విధిస్తున్నారు, కాబట్టి అక్కడ సుంకాలను తగ్గించే నిర్ణయం ముందుగానే ఉండవచ్చు.

# గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు హైకోర్టులో ఊరట

-మొదటిపేజీ తరువాయి

స్వాగతించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. ఎన్ని కుట్రలు పన్నినా న్యాయపోరాటంలో విజయం సాధించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన 563 మంది గ్రూప్-1 అభ్యర్థులకు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలి గ్రూప్-1 అధికారులైన మీరంతా రాష్ట్ర పునర్నిర్మాణానికి అంకితం కావాలని పిలుపునిచ్చారు.

**ఇవీ కేసు పూర్వపరాలు**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) 2024 ఫిబ్రవరిలో గ్రూప్-1లో 563 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2024 అక్టోబరు 21వ తేదీ నుంచి 27 వరకు ప్రధాన పరీక్షలు(మెయిన్స్) జరిగాయి. మార్చి 30న ప్రధాన పరీక్షలో అన్ని పేపర్లకు హాజరైన 21,085 మంది అభ్యర్థుల మార్కులను టీజీపీఎస్సీ ప్రకటించింది. అర్హత పరీక్ష ఇంగ్లీష్‌తో పాటు ప్రధాన పరీక్షలైన ఆరు పేపర్ల మార్కులను వెల్లడించింది. అయితే టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్‌లో జవాబు పత్రాల మూల్యాంకనం, ఎగ్జామ్ సెంటర్ల కేటాయింపులో అవకతవకలు, తెలుగు మాధ్యమంలో జవాబులు రాసిన వారికి అన్యాయం జరిగిందంటూ పలువురు అభ్యర్థులు కొద్ది రోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు సుదీర్ఘ విచారణ చేపట్టి తీర్పును వెలువరించారు. ఆన్సర్ పేపర్లు దిద్దిన వారిలో ఎక్కువ మందికి తెలంగాణ చరిత్రపై అవగాహన లేదని, దానివల్ల మార్కుల కేటాయింపులో అన్యాయం జరిగిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. సబ్జెక్ట్ నిపుణులతోనే జవాబు పత్రాల మూల్యాంకనం జరిగిందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరఫు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు.

**సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసిన సీజే ధర్మాసనం**

అభ్యర్థుల పిటిషన్లపై విచారణ ముగిసిన తరువాత జవాబు పత్రాలు తిరిగి మూల్యాంకనం చేయాలని లేకుంటే మరోసారి పరీక్ష నిర్వహించాలంటూ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం కొద్ది రోజుల క్రితం తీర్పును వెలువరించింది. ఈ తీర్పుపై టీజీపీఎస్సీ అప్పీలు చేయగా సింగిల్ జడ్జి తీర్పు అమలును హైకోర్టు నిలిపివేసింది. దీంతో కమిషన్ తుది ఎంపికకు సంబంధించిన ఫలితాలను వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత గ్రూప్-1 పోస్టుల నియామకాలు చేపట్టడం ఇదే తొలిసారి. తుది ఎంపికలు హైకోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని టీజీపీఎస్సీ ప్రకటించింది.

మెయిన్స్ జవాబు పత్రాలు మరోసారి మూల్యాంకనం చేయాలని హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పుపై టీజీపీఎస్సీ, ఎంపికైన అభ్యర్థుల అప్పీల్ చేశారు. గతంలో విచారణ జరిపిన ధర్మాసనం తాజాగా తీర్పును వెలువరించింది. సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ తాజాగా ఆదేశాలు జారీచేసింది. దీంతో గ్రూప్-1కు ఎంపికై ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు భారీ ఊరట లభించినట్లయింది. గ్రూప్-1 నియామకాలకు సంబంధించి సుదీర్ఘ కాలంగా సాగుతున్న కేసులో తాజాగా హైకోర్టు తీర్పుతో ఎంపికైన అభ్యర్థుల భవితవ్యంపై అనిశ్చితి తొలగిపోయింది.

# దొడ్డు బియ్యానికి రాని టెండర్లు

## గౌడన్లలో 24 లక్షల టన్నులు.. త్వరలో మరో 12 లక్షల టన్నులు..

**హైదరాబాద్ :** దొడ్డుబియ్యం వదిలించుకునేందుకు పౌరసరఫరాల శాఖ మల్లగుల్లాలు పడుతోంది. ఇప్ప టికే మూడేండ్లుగా మూలుగుతున్న 1.5 లక్షల టన్నుల దొడ్డు బియ్యాన్ని ఎలాగైనా వదిలించుకుందామని చూసేంతలో.. మరో 24 లక్షల టన్నుల దొడ్డు బియ్యం క్యూలో ఉన్నాయి. ఇదీ కాకుండా.. వచ్చే ఏప్రిల్‌లో మరో 12 లక్ష ల టన్నుల దొడ్డు బియ్యం రానున్నాయి.. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుంటే.. నష్టం మా ట అటుంచితే.. అసలుకే మోసం వచ్చే పరిస్థితి కనపడుతోంది. దీంతో పౌర సరఫరాల విభా గం ఎలాగైనా ఈ దొడ్డురకం బియ్యం ఇబ్బందులను అధిగమించాలనే ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. తక్కువ నష్టంతో అయినా ఫరవాలేదు.. పూర్తిగా నష్టపోకుండా చూసుకుంటే అదే పదివేలు అనే పరిస్థితి నెలకొంది. దీనిపైనే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర ఆలోచన చేస్తున్నారు. అటు ప్రజాధనాన్ని నష్టపోకుండా.. ఇటు సర్కారుకు భారం కాకుం డా.. వీలైనంత తక్కువ నష్టంతో బయటపడే మార్గాలను మంత్రి ఉన్నతాధికారులతో సమాలోచనలు చేస్తున్నారు. గడిచిన మూడేండ్లుగా 1.5 లక్షల టన్నుల దొడ్డు రకం బియ్యం గోదాముల్లో మూలుగుతున్నాయి. ప్రజలకు పూర్తిగా సన్నరకం బియ్యం అందిస్తున్న నేపథ్యంలో.. రాష్ట్రంలోని రైతుల నుంచి సేకరించిన దొడ్డురకం ధాన్యా న్ని మిల్లింగు చేసిన తరువాత.. సెంట్రల్ కోటా కింద ఎఫ్‌సీఐకి బియ్యం ఇచ్చిన తరువాత కూడా 1.5 లక్షల టన్నుల దొడ్డు బియ్యం మిగిలాయి. వాస్తవానికి మొత్తం ఖర్చు చూసుకుం టే.. కిలో రూ. 36.50 పైసలు పడింది. అయితే, మూడేండ్ల నుంచి కిరాయి చెల్లించి.. వీటిని గోదాముల్లో రక్షిస్తున్నారు. కొంత మొ త్తం రేషన్ డీలర్ల వద్ద, ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ఉన్నాయి. మూడేండ్లుగా అలాగే ఉండటంతో ఇందులో సుమారు 15 నుంచి 20 వేల టన్నుల బియ్యం ఇప్పటికే ఎలుకలు, పందికొక్కులు బారినపడి, అలాగే ముక్కిపోయి నట్టుగా అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మిగతావికూడా ఎందుకూ పనికిరానివిగా మారకముందే.. ఏదో ఒక ధర కు విక్రయిస్తే.. తక్కువ నష్టంతో బయటపడ వచ్చనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం కిలో రూ. 24 చొప్పున టెండర్ పిలిచింది. అయితే దీనికి కూడా ప్రైవేటు వ్యాపారస్తులు స్పందించలేదు. అంత ధర తాము పెట్టలేమని ముందుకు రాలేదు. దీనితో ఇప్పుడు మరో రూ. 2 తగ్గిం చి.. కిలోకు రూ. 22తో టెండర్లు పిలవడానికి ప్రయత్నాలు మొదలెట్టింది. మొత్తంగా చూసుకుంటే.. 1.5 లక్షల టన్నుల బియ్యంను రూ. 22 తో అమ్మివేస్తే (రూ. 36.50 పైసలకు కిలో చొప్పున కొనుగోలు చేశారు) ఎంత లేదన్నా సుమారు రూ. 180 నుంచి రూ. 200 కోట్ల వరకు ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుంది. అయితే, ఈ నష్టం గురించి ఆలోచిస్తూ.. మరిం త జాప్యం చేస్తే.. మొత్తం బియ్యమే పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. అలా జరిగితే మొత్తం బియ్యాన్ని సముద్రంలో పారబోయాల్సిందే గానీ.. ఎవరు రూపాయికి కూడా కొన రు. దానికంటే.. రూ. 200 కోట్ల నష్టంతోనైనా ఈ బియ్యాన్ని అమ్మివేయడమే లాభదాయకమని ప్రభుత్వం భావిస్తోంది. మూడేండ్ల కిందటి దొడ్డు బియ్యం పరిస్థితి ఇలా ఉంటే.. మరో ప్రమాదం సివిల్ సప్లై శాఖను వేధిస్తోంది.



గడిచిన రెండు సీజన్లలోనూ రైతుల పండించిన దొడ్డురకం ధాన్యా న్ని కొనుగోలు చేసిన సివిల్ సప్లై విభాగం.. కేంద్రం కోటా కింద ఎఫ్‌సీఐకి పంపించాల్సిన బియ్యాన్ని పంపించింది. అయినా.. ఒక్కో సీజన్‌లో సుమారు 12 లక్షల టన్నుల దొడ్డు బియ్యం అలాగే ఉన్నాయి. అంటే మొత్తం 24 లక్షల టన్నుల దొడ్డు బియ్యం గోదాముల్లో రెడీగా ఉన్నాయి. వాటి పరిస్థితి ఏంటనే ప్రశ్నకూడా ఉదయిస్తోంది. దీనిగురించి ఆలోచి స్తుండగానే.. ఈ ఏప్రిల్‌లో.. (ఈ రబీ పంట) మరో 12 లక్షల టన్నుల దొడ్డు బియ్యం రానున్నాయి. అంటే.. ఏప్రిల్-మే నాటికి మొత్తం 36 లక్షల టన్నుల దొడ్డు బియ్యం అందుబాటులో ఉండనున్నాయి. మూడేండ్ల కిందటి 1.5 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని వదిలించుకోవ డానికే నానా తంటాలు పడుతున్న పౌరసరఫరాల శాఖ.. రాబోయే నాలుగై దు నెలల్లో 36 లక్షల టన్నుల దొడ్డు బియ్యా న్ని ఏం చేయాలనేది ఇప్పటి నుంచే తొలుస్తున్న ప్రశ్న. ఇప్పటి వరకు పరిస్థితిని పరిశీలిస్తే.. 1.5 లక్షల టన్నుల దొడ్డు బియ్యాన్ని రూ. 22లకే అమ్మితే.. సుమారు రూ. 200 కోట్ల నష్టం వస్తుంది. అదే విధంగా 36 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని కూడా అమ్మితే మొత్తం సుమారు రూ. 7000 కోట్ల నష్టం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రైతుల నుంచి దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసి, మిల్లింగ్ చేసి, గోదాములకు తరలించే వరకు ఒక్కో కిలోకు రూ. 36.50 పైసలు ఖర్చు అవుతుంది. అవే దొడ్డు బియ్యా న్ని కిలోకు రూ. 22 లకే అమ్మివేస్తే.. ఎంత లేదన్నా సుమారు రూ. 5000 కోట్లు నష్టపోయినట్టే. దీనితోపాటు వడ్డీ నష్టం కూడా సుమారు రూ. 1000 కోట్ల వరకు ఉంటుంది. వీటన్నింటినీ అమ్మకం పూర్తయి కొనుగోలు చేసినవారు తీసుకెళ్లే వరకు గోదాములకు కిరాయి రూపంలో మరో రూ. 350 కోట్ల వరకు ఖర్చవుతుంది. అంటే ఏతావాతా చూసుకుంటే.. మొత్తం సుమారు రూ. 7000 కోట్ల నష్టం వాటిల్లక తప్పని పరిస్థితే కనపడుతోంది. అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉండకతప్పదు. ఎందుకంటే.. ఏమాత్రం ఆలస్యం చేసినా.. ఇవన్నీ ముక్కిపోయి.. పనికిరాకుండా పోతే.. మొత్తానికి మొత్తమే మునిగిపోయే పరిస్థితి తలెత్తు తుంది. రూ.7వేల కోట్ల నష్టాన్ని భరిస్తే.. ఇం కో రూ. 7 వేల నుంచి రూ. 8 వేల కోట్లన్నా వస్తాయి. లేదంటే.. మొత్తం సుమారు రూ. 14 వేల నుంచి రూ. 15 వేల కోట్లు మొత్తం మునిగిపోక తప్పదు. ప్రస్తుతం మన రాష్ట్రంతో పాటు.. పక్క రాష్ట్రాల్లో.. సమీప దేశాల్లోనూ దొడ్డు బియ్యానికి డిమాండ్ లేదు. మన రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం సన్నబియ్యమే రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తోంది. ఇక సంక్షేమ హాస్టళ్లలోనూ సరేసరి సన్నబియ్యంతోనే భోజనాలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రైతాంగం సన్న రకం ధాన్యం పండించే దిశగా కొంతమేర మళ్లినప్పటికీ.. పూర్తిగా ఇంకా మరలలేదు. దీనితో ప్రతి సీజన్‌లోనూ వస్తున్న దొడ్డు రకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనకతప్పని పరిస్థితి నెలకొంది. సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్‌ను ప్రభుత్వం ఇస్తోంది. దీనితో సుమారు 8 జిల్లాల్లో ఎక్కువ మంది రైతులు సన్నరకం ధాన్యం వైపు మళ్లారు. మిగిలిన జిల్లాల్లోనూ రైతాంగాన్ని దొడ్డు రకం నుంచి సన్నరకం ధాన్యం వైపు మళ్లించాల్సిన అవసరం ఉంది. ఇలా ప్రతియేటా నష్టపోయేకన్నా.. అసలు రైతాంగానికి అవ గా హన కల్పించి.. వారిని దొడ్డు ధాన్యం నుంచి సన్న ధాన్యం దిశగా మళ్లిస్తే అందరికీ మంచిదనే ఆలోచనలో పౌరసరఫ రాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నట్టు సమాచారం.

## మున్సిపల్ ఎన్నికల్లో రెబల్స్ బెడద

-మొదటిపేజీ తరువాయి

మార్పు లేదు. వారి కారణంగా పలుచోట్ల తమ గెలుపోటములు తారుమారయ్యే అవకాశం ఉందని పార్టీల అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

**ససేమిరా అనడంతో :** టికెట్ల కేటాయింపు నుంచి మొదలైన వివాదాలు, నామినేషన్ల ఉపసంహరణ నాటికి తారాస్థాయికి చేరుకున్నాయి. పలుచోట్ల బీ-ఫాంలు చేతికందని ఆశావాహూలు తమ పార్టీ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కొన్నిచోట్ల ఇవి తారస్థాయికి చేరి ఆత్మహత్యలు చేసుకుంటామనే స్థాయి వరకు వెళ్లింది. వివిధ సమీకరణలు, అభ్యర్థులకున్న పట్టును అంచనావేసి బీ-ఫాంలను ఇచ్చారు. టికెట్ రానివారిలో చాలామంది అప్పటికే ఎన్నికల ప్రచారంలోకి దిగడం, ఎన్నికల షెడ్యూల్ నుంచి వార్డుల్లో పర్యటిస్తూ పోటీలో ఉంటామని ప్రజలను కలవడంతో నామినేషన్ల ఉపసంహరణలకు వారు ససేమిరా అన్నారు.

**పలు ప్రాంతాల్లో ఇలా :**

కరీంనగర్ కార్పొరేషన్‌లోని 3 డివిజన్లలో బీజేపీకి తిరుగుబాటు అభ్యర్థులు ఉన్నారు. తమకు టికెట్ నిరాకరించారని వారు ప్రచారంలో ముందుకెళ్తున్నారు. కాంగ్రెస్ పార్టీలోనూ 3 డివిజన్లలో సై అంటే సై అనేలా పోరుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 467 డివిజన్లు, వార్డుల్లో దాదాపు 50 చోట్ల పార్టీలకు ఈ బెడద ఉంది. ఖమ్మం జిల్లాలోని వైరాలో 8 వార్డులలో 9 మంది అధికార పార్టీకి రెబెల్స్‌గా ఎన్నికల బరిలో ఉన్నారు. సత్తుపల్లిలో ఒక వార్డులో, కల్లూరులో రెండుచోట్ల భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) తిరుగుబాటు అభ్యర్థులు రంగంలో నిలిచారు. సూర్యాపేటలో కాంగ్రెస్‌లో 8 మంది, బీఆర్ఎస్‌లో 3, నల్గొండ కార్పొరేషన్‌లో మూడు పార్టీల తరఫున ఒక్కో డివిజన్‌లో ఒకరు చొప్పున తిరుగుబాటు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తిరుమలగిరిలో కాంగ్రెస్ నుంచి నలుగురు, భారత రాష్ట్ర సమితి నుంచి ఒకరు రెబల్ అభ్యర్థులున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జగన్ పార్టీకి రిజైన్ చేశారు. కల్వకుర్తిలోని 11వ వార్డులో నామినేషన్ వేసినప్పటికీ టికెట్ దక్కలేదు. దీంతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లిలో భారత రాష్ట్ర సమితి టికెట్లు రాని 9 మంది ఏఐఎఫ్‌బీ నుంచి పోటీలో ఉన్నారు. టికెట్ రాకపోవడంతో వనపర్తి జిల్లాలోని పెబ్బేరు 3 వార్డులో మాజీ కౌన్సిలర్ సువర్ణ, ఆమె భర్త కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకట్రాములు ఇద్దరూ ఎన్నికల బరిలో ఉంటూ ప్రచారాన్ని సాగిస్తున్నారు. మెదక్ కాంగ్రెస్‌లో ముగ్గురు, బీఆర్ఎస్ ఒకరు అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. సంగారెడ్డి, నారాయణఖేడ్, సదాశివపేట, జహీరాబాద్, గడ్డిపోతారం, అందోలు బల్దియాల్లో తిరుగుబాటు అభ్యర్థుల బెడద ఎక్కువగా ఉంది. మరోవైపు సంగారెడ్డిలో ముగ్గురు కాంగ్రెస్ నాయకులను సస్పెండ్ చేశారు. జహీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి 15 మంది, భారత రాష్ట్ర సమితికి ఆరుగురు రెబల్ అభ్యర్థులున్నారు. ఉమ్మడి వరంగల్‌లో 260 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీకి 26 మంది రెబల్ అభ్యర్థులు ఉన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో కాంగ్రెస్ నుంచి ఏడుగురు తిరుగుబాటు అభ్యర్థులు బరిలో నిలిచారు. రెబల్ అభ్యర్థుల కారణంగా తమ భవితవ్యం తారుమవుతుందని ఆయా పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభర్థులు వాపోతున్నారు.

## ఉచిత కరెంటు దేశానికి ఆదర్శం

-మొదటిపేజీ తరువాయి

పడక గదుల ఇళ్లు కూడా కట్టించలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే విషం చిమ్ముతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం మొత్తం దాడికి దిగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదికి 2 లక్షల ఇళ్లు కట్టినా పదేళ్లలో 20 లక్షల ఇళ్లు కట్టే పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు.

**ఏం ఇవ్వడానికి ఢిల్లీ నేతలను తెచ్చారు**

ఉచిత కరెంటు దేశానికి ఆదర్శమైందని, ఉచిత కరెంటు కాంగ్రెస్ పేటెంట్ అని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్ ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని అన్నారు. పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా చేస్తామని మోదీ చెప్పారని, మూడుసార్లు మోదీ ప్రధాని అయినా పాలమూరును జాతీయ ప్రాజెక్టు చేయలేదని గుర్తు చేశారు. కాళేశ్వరం జాతీయ ప్రాజెక్టు ఇవ్వలేదని, మెట్రో, మూసీకి నీళ్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ పూర్తిపై స్పష్టత లేదని, ఏం ఇవ్వడానికి ఢిల్లీ నేతలను తెచ్చారని, బీజేపీ జాతీయ అధ్యక్షుడు గాడిద గుడ్డు తెచ్చారు తప్ప అణాపైసా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.

**తామే గెలుస్తామని బీఆర్ఎస్ రంకెలేస్తోంది**

బీజేపీ హామీలు అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని, బీఆర్ఎస్, బీజేపీ బంధం ఫెవికాల్, వీణా-వాణి బంధం కాదా? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇటీవల ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ చచ్చి అవయవదానం చేసిందని, ఓట్లు, సీట్లు బీఆర్ఎస్ దానం చేసి 8 చోట్ల బీజేపీ ఎంపీలను గెలిపించారని, 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయినా తామే గెలుస్తామని బీఆర్ఎస్ రంకెలేస్తోందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చారని మోదీ, అమిత్‌షా స్వయంగా చెప్పారు. కాళేశ్వరంపై కమిషన్ వేసి నిందితులను అరెస్టు చేయాలని అసెంబ్లీలో నిర్ణయించామని, అసెంబ్లీ తీర్మానం కేంద్రానికి పంపిస్తే ఇప్పటికీ సీబీఐ విచారణ చేపట్టలేదని, కేసీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేయాలని అసెంబ్లీలో తీర్మానిస్తే సీబీఐ విచారణ లేదని వివరించారు. "ఉచిత కరెంటు దేశానికి ఆదర్శమైంది. ఉచిత కరెంటు కాంగ్రెస్ పేటెంట్. రైతులకు ఉచిత విద్యుత్ ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుంది. పాలమూరు జిల్లాలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ప్రచారానికి తీసుకువచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారానికి ప్రధాని సహా దేశం మొత్తం నేతలను తీసుకురండి. బీజేపీ అందరినీ ప్రచారానికి తెచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా?. కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో బీజేపీకి చూపిస్తాం. పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా చేస్తామని మోదీ చెప్పారు. ఏం ఇవ్వడానికి ఢిల్లీ నేతలను తెచ్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు గాడిద గుడ్డు తెచ్చారు తప్ప అణాపైసా ఇవ్వలేదు."

## మరో రెండేళ్లలో కేసీఆర్ సీఎం అవుతారు

-మొదటిపేజీ తరువాయి

వాటిని అమలు చేయలేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి ఇవ్వలేదు కానీ బంగారం ధర మాత్రం భారీగా పెరిగిందని అన్నారు. అప్పుడు బంగారం ఆశపెట్టిన ముఖ్యమంత్రి ఇప్పుడు మాట్లాడటం లేదని విమర్శించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులపై తిట్ల వర్షం కురిపించడం తప్ప రేవంత్ రెడ్డికి తెలిసిందేమీ లేదని అన్నారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్‌లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. ఎన్నికల తర్వాత రైతు బంధు ఇస్తామని ముఖ్యమంత్రి అంటున్నారని, కానీ ఈ నెల 11 లోపు ఇవ్వకపోతే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే అభివృద్ధి విషయంలో కేసీఆర్‌తో పోటీ పడాలని సవాల్ చేశారు.

# ప్రధానపార్టీలకు రెబల్స్ టెన్షన్

**అదిలాబాద్ :** మంచిర్యాల జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు అభ్యర్థుల్లో వేడిని రేకెత్తిస్తున్నాయి. జిల్లాలోని కార్పొరేషన్ తో పాటు నాలుగు మున్సిపాలిటీల్లోని 149 వార్డులకు 1061 మంది అభ్యర్థుల లో 368 మంది విత్ డ్రా కాగా 693 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మరోవైపు ఇండిపెండెంట్ల రూపంలో ప్రధాన పార్టీలకు రెబల్స్ బెడద ఎక్కువగా ఉండటంతో ఒకింత ఆందోళనకు గురవుతున్నారు. ఓట్లు చీల్చితే ఇతరులకు లబ్ధి చేకూరే అవకాశం ఉండటం తో రాత్రిళ్లు రెబల్స్‌ను బుజ్జగించి తమకు సపో ర్టు చేయమని బతిమిలాడుతు న్నారు. జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్, బెల్లంపల్లి, చెన్నూర్, క్యాతనపల్లి, లక్షెట్టిపేట మున్సి పాలిటీల్లోని 149 స్థానాలకు 1061 మంది అభ్యర్థులు 1177 నామినేషన్లు ఆమోదం పొం దాయి. మంగళ వారం బీ ఫారంల అందజేత, విత్ డ్రాల అనంతరం ప్రధాన పార్టీల నుంచి రెబల్ గా వేసిన అభ్యర్థులు, బీ ఫారంలు ఇవ్వని అభ్యర్థులంతా ఇండిపెండెంట్లుగా బరి లో ఉన్నారు. ఇండిపెండెంట్ల సంఖ్య 135 నుంచి 168 (మంచిర్యాలలో 18 మంది, బెల్లంపల్లిలో 66, చెన్నూర్ లో 38, క్యాతనపల్లిలో 35, లక్షెట్టిపేటలో 11) కి పెరిగింది. ఈ ఎన్నికలలో రెబల్స్ ప్రభావం అధికార పార్టీ అభ్య ర్థులపైన పడే అవకాశం ఎక్కువ ఉండనుందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కార్పోరేషన్, మున్సిపాలిటీల్లో కాం గ్రెస్ నుంచి 148 మంది, బీఆర్ఎస్ నుంచి 139 మంది, బీజేపీ నుంచి 132, ఆల్ ఇండియా ఫార్వర్డ్ పార్టీ (ఏఐఎఫ్బీ) నుంచి 28, బీఎస్పీ నుంచి 18, సీపీఐ నుంచి 17, జనసేన పార్టీ నుంచి 16,ఆప్ నుంచి తొమ్మిది, సీపీఎం నుంచి ఆరుగురు, ఏఐఎంఎం నుంచి నలుగురు, ఇతర గుర్తింపు పొందిన పార్టీల నుంచి ఎనిమిది మంది పోటీ చేస్తుండగా ఇం డిపెండెంట్లు 168 మంది బరిలో నిలబడ్డారు. మంచిర్యాలలో 60 డివిజన్లు ఉండగా కేవ లం 18 మంది ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తుండగా బెల్లంపల్లిలో అత్యధికంగా 66 మంది, చెన్నూర్‌లో 38, క్యాతనపల్లిలో 35, లక్షెట్టిపేటలో 11 మంది పోటీపడుతున్నారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు 362 మంది నామినేషన్లు వేసి 122 మంది విత్ డ్రా చేసుకోగా 240 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 59 మంది, బీఆర్ఎస్ నుంచి 58, బీజేపీ నుంచి 58, ఆప్ నుంచి 8 మంది, బీఎస్పీ నుంచి ఏడుగురు, ఏఐఎంఎం నుంచి రెండు, సీపీఎం నుంచి రెండు, ఏఐఎఫ్బీ నుంచి 18, సీపీఐ నుంచి ఒకరు, జనసేన నుంచి నలుగురు, ఇత ర గుర్తింపు పొందిన పార్టీల నుంచి ఐదుగు రు, ఇండిపెండెంట్లు 18 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 34 వార్డులకు 252 మంది అభ్యర్థులు నామినేషన్ వేసి 79 మంది విత్ డ్రా అయ్యారు. ప్రస్తుతం పోటీలో 173 మంది ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 34 మంది అభ్యర్థులు, బీఆర్ఎస్ నుంచి 34, బీజేపీ నుంచి 20, బీఎస్పీ నుంచి ఆరుగురు, ఏఐఎంఎం నుంచి ఇద్దరు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్బీ) నుంచి ఒకరు, సీపీఐ నుంచి ఆరుగురు, జనసేన నుంచి ఒక్కరు, ఇతర గుర్తింపు పొందిన పార్టీల నుంచి ముగ్గురు, ఇండిపెండెంట్లు 66 మంది బరిలో ఉండగా చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులకు 154 మంది అభ్యర్థుల నామినేషన్లు వేయగా 47 మంది ఉపసంహరించుకోవడంతో 107 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 18 మంది అభ్యర్థులు, బీఆర్ఎస్ నుం చి 18, బీజేపీ నుంచి 18, బీఎస్పీ నుంచి ఒకరు, సీపీఎం నుంచి ఒకరు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్బీ) నుంచి ఐదుగురు, సీపీఐ నుంచి ముగ్గురు, జనసేన నుంచి నలుగురు, ఆప్ నుంచి ఒకరు, ఇండిపెండెంట్లు 38 మం ది పోటీలో ఉన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులకు 193 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసి ఇందులో 80 మంది విత్ డ్రా కాగా 113 మంది పోటీలో ఉన్నారు. ఇందులో కాంగ్రెస్ నుంచి 22 మం ది, బీఆర్ఎస్ నుంచి 15, బీజేపీ నుంచి 22, బీఎస్పీ నుంచి ఇద్దరు, ఏఐఎంఎం నుంచి రెండు, సీపీఎం నుంచి ఇద్దరు, ఏఐఎఫ్బీ నుంచి నలుగురు, సీపీఐ నుంచి ఏడుగురు, జనసేన నుంచి నలుగురు, ఇండిపెండెంట్లు 35 మంది అభ్యర్థులు, లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులకు వంద మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా ఇందులో 40 మంది ఉపసంహరించుకోవడంతో 60 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. కాంగ్రె స్ నుంచి 15 మంది, బీఆర్ఎస్ నుంచి 14, బీజేపీ నుంచి 14, బీఎస్పీ నుంచి ఇద్దరు, ఏఐఎంఎం నుంచి రెండు, సీపీఎం నుంచి ఒకరు, జనసేన నుంచి ముగ్గురు, ఇండిపెండెంట్లు 11 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

# గుడుంబా, నల్ల బెల్లం స్వాధీనం

## బైక్ సీజ్.. ఇద్దరిపై కేసు నమోదు

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** బోథ్ మండలం ధన్నూర్ నుంచి నాగపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఎక్సైజ్ శాఖ అధికారులు రూట్ వాచ్ నిర్వహించిన సందర్భంగా గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. బైక్‌పై ప్రయాణిస్తున్న రాథోడ్ సచిన్ అనే వ్యక్తిని తనిఖీ చేయగా, అతని వద్ద సుమారు 5 లీటర్ల గుడుంబా లభ్యమైంది. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు, గుడుంబా తయారీలో ఉపయోగించే నల్ల బెల్లాన్ని బోథ్ మండల కేంద్రంలోని శబరి కిరణ షాప్ నుంచి తీసుకున్నట్లు రాథోడ్ సచిన్ ఒప్పుకున్నట్లు తెలిపారు. దీంతో ఎక్సైజ్ అధికారులు శబరి కిరణ షాప్‌ను తనిఖీ చేయగా, అక్కడ నుంచి సుమారు 30 కిలోల నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి రాథోడ్ సచిన్‌తో పాటు కిరణ షాప్ యజమాని సిలారి నరసింహ దాస్పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అలాగే గుడుంబా తరలించేందుకు ఉపయోగించిన బైక్‌ను సీజ్ చేసినట్లు ఇచ్చోడ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫికర్ అహ్మద్ వెల్లడించారు. గుడుంబా, దేశీ దారు లేదా నల్ల బెల్లం విక్రయం, నిల్వ లేదా రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ట్రైనీ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎక్సైజ్ సిబ్బంది కార్తీక్, మొహమ్మద్, దేవేందర్ పాల్గొన్నారు.



# యశోధ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

**హైదరాబాద్ :** సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్ వైద్యులు, 10 నెలల వయసున్న బాలుడికి సోకిన అరుదైన కంజెనిటల్ అమేగాకారియోసైటిక్ థ్రోంబోసైటోపెనియా అనే వ్యాధిని విజయవంతంగా నయం చేశారు. ఇది వంశపారం పర్యంగా వచ్చే బోన్‌మారో సమస్య. దీనివల్ల రక్తంలో ప్లేట్‌లెట్స్ గణనీయంగా తగ్గిపోయి, ప్రాణాంతక రక్తస్రావం జరిగుతూ ఉంటుంది. దీనికి ఏకైక శాశ్వత పరిష్కారం హెమటోపోయిటిక్ స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్. అరుదైన ఈ చికిత్సను ఈ బాలుడికి విజయవంతంగా నిర్వహించారు యశోద హాస్పిటల్స్ వైద్యులు. ప్లేట్‌లెట్స్ కౌంట్ నిరంతరంగా తక్కువగా ఉండటంతో ఆ బాలుడిని యశోద హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. సమగ్ర క్లినికల్, ల్యాబొరేటరీ పరీక్షల తర్వాత వ్యాధిగా నిర్ధారించారు. ఆ బాలుడి గ్రూప్‌నకు పూర్తిగా సరిపోయే దాత దొరకకపోవడంతో మరో సమస్య ఎదురైంది. అయితే బాలుడి తండ్రిని హాప్లో ఐడెంటికల్ స్టెమ్ సెల్ దాతగా ఎంపిక చేసి, ఆలస్యం చేయకుండా ట్రాన్స్‌ప్లాంట్ ప్రక్రియను పూర్తి చేశారు. ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత ఆసుపత్రిలో ఉన్న సమయంలో, ఆహారం తింటున్నప్పుడు అవి శ్వాసనాళంలోకి వెళ్లడంతో మరో సమస్య ఎదురైంది. బాలుడికి అకస్మాత్తుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడింది. ఆక్సిజన్ తగ్గడం, గుండె వేగం తగ్గడం వంటి సమస్యలు తలెత్తాయి. వెంటనే పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్చి, నాలుగు రోజుల పాటు మెకానికల్ వెంటిలేషన్ అందించారు. వైద్యుల నిరంతర పర్యవేక్షణతో బాలుడు పూర్తిగా కోలుకున్నాడు. ప్రస్తుతం బాలుడి రక్తంలో



ప్లేట్‌లెట్ కౌంట్స్ మెరుగుపడ్డాయి. ప్లేట్‌లెట్ ట్రాన్స్‌ఫ్యూషన్ అవసరం లేకుండానే బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉంది. దీంతో ఆపరేషన్ విజయవంతమైందని వైద్యులు ప్రకటించారు. సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ డాక్టర్, సీనియర్ కన్సల్టెంట్ హెమటో–ఆంకాలజీ, ఽఓ ఫిజీషియన్ కరణం అశోక్ కుమార్ ఈ కేసు గురించి మాట్లాడుతూ " కంజెనిటల్ అమెగాకారియోసైటిక్ థ్రోంబోసైటోపెనియా అనేది చాలా అరుదైన, తీవ్రమైన వ్యాధి. సకాలంలో స్పందించకపోతే ఇది ప్రాణాంతకం కావచ్చు. స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ దీనికి ఏకైక పరిష్కారం. ఈ కేసు ద్వారా ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించడం, అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉండటం ఎంత ముఖ్యమో అర్థమవుతుంది, మల్టీడిసిప్లినరీ కేర్‌తో, పీడియాట్రిక్ బ్లడ్ డిజార్డర్స్‌కి కూడా విజయవంతంగా చికిత్స చేయవచ్చు" అని తెలిపారు. ఈ చికిత్స విజయవంతం కావడంలో యశోద హాస్పిటల్స్ హెమటాలజీ ఉ ట్రాన్స్‌ప్లాంటేషన్, పీడియాట్రిక్స్, ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్, క్రిటికల్ కేర్, నర్సింగ్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగాలకు తల్లిదండురుల కృతజ్ఞత చెప్పారు. గతంలో ప్రాణాంతకమని భావించిన అనేక రకాల పీడియాట్రిక్ బ్లడ్ డిజార్డర్స్, నేడు ఆధునిక వైద్య పురోగతి వల్ల నయం చేయవచ్చని ఈ కేసు నిరూపిస్తోంది. అయితే, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, సరైన చికిత్స అందించడం అత్యంత కీలకమని గుర్తుచేస్తోంది.

# బీఆర్ఎస్ బీసి వ్యతిరేక పార్టీ

**హైదరాబాద్ :** బీఆర్ఎస్‌పై కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని అధికారికంగా ప్రకటించారని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తున్న వారి నోటి కాడ ముద్ద లాక్కున్న బుట్టంగారి మాధవ రెడ్డికి టికెట్ ఇవ్వడంతో స్పష్టమైందన్నారు. ఆయనకు మున్సిపల్ ఎన్నికల బరిలో నిలబెట్టి తాము బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని బీఆర్ఎస్ రాజముద్ర వేసి చెప్పిందన్నారు. అలా కాదనుకుంటే ఆ పార్టీ ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఉందని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కీలక విషయాలు వెల్లడించారు. బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం జాగృతి సహా బీసీ సంఘాలన్నీ పోరాటం చేస్తున్నాయని గుర్తు చేశారు. ఎన్నో రోజులు పోరాటం చేసి, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 42 శాతం రిజర్వేషన్ల బిల్లు వచ్చేలా చేశామని వివరించారు. కానీ బుట్టంగారి మాధవ్ రెడ్డి సహా మరొక వ్యక్తి దీనిపై పిటిషన్ వేశారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తికి ఇప్పుడు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చిందని మండిపడ్డారు. అంటే ఈ కేసును బీఆర్ఎస్ వేయించిందా? బీసీల రిజర్వేషన్లకు బీఆర్ఎస్ వ్యతిరేకమా? అని ప్రశ్నించారు. ఈ మాధవ్ రెడ్డి అనే వ్యక్తి హరీష్ రావుకి చాలా దగ్గర వ్యక్తి అని తెలిపారు. హరీష్ రావు పర్సనల్ లాయర్ ఈ కేసు వేయించారని ఆరోపించారు. అప్పుడు దీని వెనుక ఉన్నది హరీష్ మాత్రమే అని విమర్శించారు. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ ఆయనకు టికెట్



ఇవ్వటం కారణంగా దీని వెనుక బీఆర్ఎస్ మొత్తం ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. తెలంగాణలో 56 శాతం ఉన్న బీసీల నోటికాడి బుక్క గుంజుకునే ప్రయత్నం చేసిన వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారని నిలదీశారు. బీఆర్ఎస్ అసలు బీసీల విషయంలో చిత్తశుద్ధితో లేదని ధ్వజమెత్తారు కవిత. పార్టీ పరంగా కూడా వాళ్లు మీటింగ్ పెట్టలేదన్నారు. బీసీ ప్రజాప్రతినిధుల ఫోరమ్ పేరుతో మాత్రమే మీటింగ్‌లు పెట్టారని తెలిపారు. జనగణనన విషయంలో కూడా ముందు కన్‌ఫ్యూజ్ చేశారని, తర్వాత మళ్లీ జనగణన చేయాలంటూ డిమాండ్ చేశారన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో అంతా రోడ్లపైకి వస్తే కానీ వాళ్ల మీటింగ్ లు కార్యరూపం దాల్చలేదని వివరించారు. అందుకే బీసీలంతా కూడా బీఆర్ఎస్ పార్టీ వైఖరిని గమనించాలని కవిత విజ్ఞప్తి చేశారు. బుట్టంగారి మాధవ్ రెడ్డిని నాయకుడిని చేసింది జాగృతియేనని తెలిపారు. హరీష్ రావు ఆయనను తప్పుదోవ పట్టించి కేసు వేయించారని ఆరోపించారు. బీఆర్ఎస్ పరిస్థితి ఇలా ఉంటే కాంగ్రెస్ పార్టీ కూడా తక్కువ తినలేదని చెప్పుకొచ్చారు కవిత. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచిన వారికి మునిసిపల్ ఎన్నికలకు ఇన్‌ఛార్జ్‌లు నియమించారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే అరికపూడి గాంధీని నిజామాబాద్ కాంగ్రెస్ ఇంఛార్జ్ గా చేస్తే, ప్రకాశ్ గౌడ్, తెల్లం వెంకట్ రావును కూడా తమ పార్టీ ఇన్‌ఛార్జ్‌ల జాబితాలో చోటు కల్పించారని అన్నారు. వీళ్లంతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలని స్పీకర్ ప్రకటిస్తే ఇప్పుడు కాంగ్రెస్ మాత్రం అందుకు భిన్నంగా నవ్విపోదురుగాక నాకేటీ సిగ్గు అన్నట్లుగా ఎన్నికల బాధ్యతలు అప్పగించిందని మండిపడ్డారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాలు పట్టుకొని తిరగడం కాదని, కాంగ్రెస్‌లో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని సూచించారు. ఇప్పటి వరకు పాలన చూసిన ప్రజలంతా తమతో కలిసి వస్తున్నారని కవిత అన్నారు. కొన్ని పార్టీలు కలిసి వచ్చాయని తెలిపారు. అందులో భాగంగానే మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి తరపున సింహం గుర్తుపై కొందరు పోటీ చేస్తున్నారని వెల్లడించారు. ప్రశ్నించే తమలాంటి వాళ్లతోపాటు సీపీఎం, న్యూ డెమాక్రసీ, స్వతంత్ర అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరుతున్నారని వివరించారు. తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మగౌరవ సభను ఈ నెల 12 న నిర్వహిస్తున్నామని, ఈ సభకు ఉద్యమకారులు, అమరుల కుటుంబ సభ్యులు, తెలంగాణ వాదులు హాజరుకావాలని ఆహ్వానించారు.

## గుప్త నిధుల పేరుతో భారీ మోసం

## నకిలీ బాబా సహా ఏడుగురు అరెస్ట్



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్ :** గుప్త నిధుల పేరుతో ప్రజలను నమ్మించి కోట్ల రూపాయలు దోచుకున్న నకిలీ బాబా గ్యాంగ్‌ను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు దర్శనాల రాజ్‌కుమార్‌తో పాటు అతని గ్యాంగ్‌లోని మరో ఆరుగురు సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ గ్యాంగ్‌పై ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 12 కేసులు నమోదు కాగా, 26 మంది బాధితుల నుంచి రూ.1,03,80,000 మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది. వివరాలను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఎస్పీ వెల్లడించారు. భీంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిప్పల్కోటి గ్రామానికి చెందిన దర్శనాల రాజ్‌కుమార్ గత కొన్నేళ్లుగా తనకు మంత్రశక్తి ఉందని, దేవర వస్తుందని గ్రామీణులను నమ్మించాడు. గుప్త నిధులు ఉన్నాయని, మంత్రశక్తితో బంగారం వెలికితీస్తానని చెప్పి బాధితుల నుంచి భారీగా నగదు వసూలు చేశాడు. తన బావ మహేందర్‌తో పాటు సహనిందితులు నవీన్, అరుణ్, శ్యామ్, అఖిల్, కిరణ్‌లతో కలిసి ముందుగానే తీసుకొచ్చిన నకిలీ బంగారు నాణేలను కుండలో ఉంచి, తవ్వకాల్లో లభించినట్లుగా నాటకాలు ఆడేవారు. అనంతరం కుండను పూజల పేరుతో బాధితుల వద్ద ఉంచి, మధ్యలో తాకితే ప్రమాదమని భయపెట్టి డబ్బులు తీసుకుని పరారయ్యేవారు. ఈ విధంగా వివిధ గ్రామాలకు చెందిన 26 మందిని మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. గుప్త నిధుల పేరుతో మోసపోతున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిందితుల వద్ద నుంచి ఒక కారు, ఒక ద్విచక్ర వాహనం, ఏడు మొబైల్ ఫోన్లు, నకిలీ బంగారు నాణేలు, కుండలు, పూజా సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన జైనథ్ సీఐ, భీంపూర్ ఎస్సైతో పాటు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## స్వశక్తికి వేదికగా డ్వాక్రా భవనం

## కల్లూరులో ఘనంగా భవన నిర్మాణ శంకుస్థాపన



**వాస్తవ నేస్తం,పోతంగల్:** మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ప్రభుత్వ భవనాలు వేదికలుగా నిలుస్తాయని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. పోతంగల్ మండలంలోని కల్లూరు గ్రామంలో మహిళా డ్వాక్రా సంఘాల నూతన భవన నిర్మాణానికి గురువారం ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక సర్పంచ్ రాంరెడ్డి, ఉప్ప సర్పంచ్ దశరథ్‌లు నిర్మాణ స్థలంలో శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా సంఘాలు తమ నెలవారీ పొదుపు సమావేశాలను నిర్వహించుకోవడానికి, అలాగే ఆర్థిక ప్రగతికి అవసరమైన శిక్షణా తరగతులను ఒకే చోట ఏర్పాటు చేసుకోవడానికి ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో, వీలైనంత త్వరగా పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పీరుగొండ, కానిగేని సాయిలు, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్, గ్రామ పెద్దలు, వివిధ డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలం కార్యకర్తలే..

**గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం**

**బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జికి ఘన సన్మానం**

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ఆయుధమని, వారి కృషితోనే పార్టీ గ్రామగ్రామాన బలపడుతోందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. నేరడిగొండ మండలంలోని ఆడే గజేందర్ నివాసం వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ను బజార్ హత్నూర్ మండల కాంగ్రెస్ కన్వీనర్ జల్కే పాండురంగ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, సర్పంచులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం, ఇటీవల బజార్ హత్నూర్ మండల కన్వీనర్‌గా ఎన్నికైన జల్కే పాండురంగ్‌ను, అలాగే పలు గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులను ఆడే గజేందర్ శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం రోజురోజుకు పెరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పార్టీని మరింత ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు. నాయకుల సమన్వయం, కార్యకర్తల కష్టమే పార్టీ విజయానికి పునాది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com